క్లుప్తంగా

20న ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠ

కొత్తగూడెంటౌన్: రామవరం 6వ వార్డులోని వేణుగోపాలస్వామి నగర్‌లోని శ్రీశ్రీశ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో 20వ తేదీన జరగనున్న ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆలయంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.

జీఓ 76 పునరుద్ధరించాలి

ఇల్లెందు: సకాలంలో చేతిలో డబ్బులు లేక దరఖాస్తు చేసుకోని వారి కోసం మరోమారు జీఓ 76 పునరుద్ధరించాలని ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందులో పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గడువులోపు దరఖాస్తు చేసుకున్న వారికి కూడా పట్టాలు అందలేదని, డీడీలు చెల్లించి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. మాట్లాడుతూ... ప్రభుత్వం మరోమారు జీఓ 76ను పునరుద్ధరించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

సివిక్ టెండర్లు పిలవాలి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే–5 ఓసీలో సివిక్ టెండర్లు పిలవాలని టీయూసీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్యకు టీయూసీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే యాకుబ్‌షావలీ మాట్లాడుతూ... నవంబర్‌లో టెండర్ల కాలం ముగిసిందని, గడవు పొడిగించారని, ఆ గడువు కూడా ఈ నెల 3తో ముగిసిందన్నారు. రెండు వారాలుగా పనులు లేక కార్మికులు అల్లాడుతున్నారని త్వరగా టెండర్లు పిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాయం వెంకన్న, వెంకటవాయి, రఘు, శ్యామల, సునీత, శ్యామంత్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

జూలూరుపాడు: మండలంలోని అనంతారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను హౌసింగ్ ఏఈ టి.డేవిడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. అనంతారం గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. 85 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇందులో ప్రస్తుతం 50 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. కార్యక్రమంలో కొర్సా రమేష్, ఉసికల వెంకటేశ్వర్లు, బొర్రా ఉపేందర్, రేపాల లక్ష్మి, మల్కం శిరీష, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి..

ఇలెందురూరల్: బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీలో పాఠశాల స్కావెంజర్లు, బోర్ మెకానిక్, గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ఇఫ్టూ అనుబంధ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీఓ చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాసుద్దీన్ మాట్లాడుతూ.. ఎనిమిది నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి వినతి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధానాస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఏఐటీయూసీ నాయకులు ఆస్పత్రి సీఎంఓ కిరణ్‌రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

సమ్మర్ క్యాంపులు ఎప్పుడో..?

- సింగరేణి ఉత్తర్వుల కోసం విద్యార్థుల ఎదురుచూపు
- కొత్తకోర్సులు ఏర్పాటు చేయాలి
- సత్తుపల్లిలో అదనంగా క్యాంపు ఏర్పాటు చేయాలని వినతి



సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేయాలని జీఎం శాలేంరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ప్రతీ ఏడాది ఏప్రిల్‌లో విద్యార్థులకు ఆటవిడుపు కోసం సమ్మర్ క్యాంపు నిర్వహిస్తారు. ఇది సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో కోచర్లను నియమించి వారి ద్వారా పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపయోగ పడుతుంది. కానీ ఈసారి ఏప్రిల్ మూడో వారం వచ్చినప్పటికీ అందుకు సంబంధించిన సర్క్యులర్ జారీ చేయలేదు. కొత్తగూడెం ఏరియా పరిధి సత్తుపల్లిలోని పీవీఎన్ఆర్ కాలనీలో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సుమారు వెయ్యికి పైగా ఉంటున్న నేపథ్యంలో అక్కడ కూడా సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు. సంవత్సరమంతా నాలుగు గోడల మధ్య పుస్తకాలతో కాలం గడిపి, పరీక్షల అనంతరం వారికి కొంత ఆటవిడుపు కోసం ప్రతీ సంవత్సరం యాజమాన్యం సమ్మర్ కోచింగ్‌ను ఏర్పాటు చేస్తుందని, అదేవిధంగా ఈసారి కూడా ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ మేరకు స్థానిక నాయకులు ఏరియా జీఎంకు శాలేంరాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు.

కొత్త కోర్సులతోపాటు పాతవీ కొనసాగించాలి..

గతంలో వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, హాకీ, కిక్ బాక్సింగ్‌లలో శిక్షణ ఇచ్చేవారు. అయితే ఈసారి వాటితోపాటు సాఫ్ట్‌బాల్ (కొత్త కోర్సు)ను కూడా ఏర్పాటు చేయాలని కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటలు ఆడుకోవటం ద్వారా వారి చిన్న మనసుకు మరింత ఉత్సాహం కల్పిస్తాయని, ఈసారి కూడా కార్మికుల పిల్లలకే కాకుండా స్థానిక, ప్రభావిత ప్రాంత విద్యార్థులకు కూడా అవకాశం కల్పించాలని కోరుతున్నారు.



గతేడాది సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)

కొత్త కోర్సులు ఏర్పాటు చేయాలి...



గతంలో ఉన్న కోర్సులు కాకుండా ఈసారి కొత్త కోర్సులు పెట్టి, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి, వివిధ టోర్నమెంట్‌లకు పంపించాలి. విద్యార్థుల్లో పోటీతత్వం పెంచాలి. నైపుణ్యం ఉన్న శిక్షకులను ఏర్పాటు చేయాలి. – మొగిలిపాక రవి, బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు

సత్తుపల్లిలోనూ ఏర్పాటు చేయాలి



సత్తుపల్లిలోని జేవీఆర్–2, కిష్టారం ఓసీలలో అత్యధిక బొగ్గు ఉత్పత్తి చేస్తుంది. ఈ మేరకు ఆ ప్రాంతంలో కార్మికులు, ప్రభావిత ప్రాంత ప్రజలు ఎక్కువ మంది ఉన్నారు. అక్కడ కూడా సమ్మర్ క్యాంపు అదనంగా ఏర్పాటు చేయాలి.

– ఎండీ రజాక్, ఏరియా ఉపాధ్యక్షుడు

ఉత్తర్వులు రాగానే ప్రారంభిస్తాం..



సింగరేణి సంస్థ కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తుంది. అదేవిధంగా ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కార్పొరేట్ కార్యాలయం నుంచి ఆదేశాలు రాగానే ప్రారంభిస్తాం.

– శాలేంరాజు, ఏరియా జీఎం

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: కల్లాల్లో పేరుకపోతున్న ధాన్యపు రాశులు, కొనుగోళ్లలో జాప్యం అనే శీర్షికతో బుధవారం సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తా కథనానికి సొసైటీ అధికారులు స్పందించారు. ఈ మేరకు రెడ్డిగూడెంలో సహకార సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ మోహన్‌రెడ్డి ధాన్యం కాంటాను ప్రారంభించారు. సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ... మరో నాలుగు దంతలబోరు, సంగం, కారెగట్టు, సోములగూడెం గ్రామాల్లో త్వరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సామ జన్నారెడ్డి, నారాయణరెడ్డి, సింగం భిక్షం తదితరులు పాల్గొన్నారు.

తడిసిన మక్కలు

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో మొక్కజొన్న నూర్పిడి దాదాపు పూర్తికావస్తోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో ఇప్పటికే సగానికి పైగా దిగుబడిని రైతులు దళారులకు విక్రయించారు. తేమశాతం కోసం ఆరబెట్టి విక్రయానికి సిద్ధం చేసిన మక్కలు మంగళవారం రాత్రి కురిసిన తేలికపాటి వర్షానికి తడిశాయి. దీంతో బుధవారం పలు గ్రామాలలో రైతులు పంట కల్లాలు, గ్రామశివారులోని ఖాళీ స్థలాలు, ప్రధాన రహదారులపై ఆరబెట్టారు. కొమరారం, పోలారం గ్రామాలలో మక్కలు తడిసి రంగు మారడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికే నాణ్యమైన మక్కలకు రూ.2వేలు చెల్లిస్తున్న దళారులు తడిసిన మక్కలకు ఎంత ధర తగ్గిస్తారోనని ఆందోళన చెందుతున్నారు.

నేషనల్ ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ

పాల్వంచ: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ కనబర్చారు. ఇటీవల రెండో లెవల్ పరీక్షలో విద్యార్థులు పాల్గొని ఉత్తీర్ణత సాధించారు. పలువురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్, మెరిట్ సర్టిఫికేట్లు సాధించారు. విద్యార్థులను కొత్తగూడెం జోన్ ఏజీఎం జయప్రకాష్, ప్రైమరీ ఇన్‌చార్జ్ షమ్స్ ఇరామ్, పీపీటీ ఇన్‌చార్జ్ బండారు శిరీష, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీరస్వామికి 'దళిత రత్న'

ఇల్లెందు: పట్టణానికి చెందిన మునగలేటి వీరస్వామికి దళిత రత్న అవార్డు అందజేశారు. బుధవారం అవార్డు గ్రహీత వీరస్వామి మాట్లాడుతూ.. దళితులకు అందించిన సేవలకు గాను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఉత్సవ కమిటీ వర్కింగ్ చైర్మన్ ఇటుక రాజు మాదిగ, కనకరాజు మాదిగ, డాక్టర్ కె.శ్రీనివాస్ మాదిగల చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు.

సింగరేణి మహిళా కళాశాలలో స్పోర్ట్స్ డే



విద్యార్థినులతో కళాశాల ప్రతినిధులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల స్వర్ణోత్సవాలు చేరువవుతున్న వేడుకలలో భాగంగా బుధవారం కళాశాలలో స్పోర్ట్స్ డే నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సావిత్రి వార్షిక క్రీడా నివేదికను ప్రవేశపెట్టారు. గౌరవ అతిథిగా హాజరైన జి.శ్రీదేవి మాట్లాడుతూ.. మానసిక సమతుల్యత, బలం, శారీరక దృఢత్వం పెంపొందించుకోవడానికి క్రీడలు ఉపయోగపడతాయన్నారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో జరిగే ఆసియా క్రీడలు, ఒలింపిక్స్‌లలో మన భారతీయుల భాగస్వామ్యం పెంచాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద మాట్లాడుతూ.. క్రీడలలో విద్యార్థినులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

కొత్తగూడెంటౌన్: అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు అప్రమత్తమై అగ్నిమాపకశాఖకు డయల్ 101కి సమాచారం ఇవ్వాలని కొత్తగూడెం ఫైర్ ఆఫీసర్ పుల్లయ్య అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని పలుచోట్ల అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలోని బూడిదగడ్డ బస్తీ, మేదర బస్తీలతో పాటు పలుచోట్ల అపార్టుమెంట్‌లు, నివాస గృహాల వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్తగూడెం ఫైర్ స్టేషన్ ఆఫీసర్ జి.పుల్లయ్య మాట్లాడారు. అపార్టుమెంట్‌లలో ఫైర్ సేఫ్టీ నియమాలను పాటించాలని చెప్పారు. ఇళ్లు, షాపులు బయట అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలను ఎలా అదుపు చేయాలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు.

మరమ్మతులకు సహకరించండి..

పాల్వంచ: పట్టణంలోని ముత్యాలమ్మ తల్లి గుడి మరమ్మతులకు సహకారం అందించాలని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం మున్సిపల్ కమిషనర్ కె.సుజాతకు వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ.. ఇటీవల గాలీవాన బీభత్సానికి ఆలయ ఆవరణలోని వందేళ్ల పైబడిన పాలచెట్టు విరిగి పడిందని, దీనివల్ల ఆలయ స్లాబ్, ఇతర నిర్మాణాలు దెబ్బతిన్నాయని మరమ్మతులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గంగపురి నాగేశ్వరరావు, కె.సమ్మయ్య, కె.వెంకటేశ్వర్లు, కె.లక్ష్మి, కె.సంఘమిత్ర, జి.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

20నుంచి పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 20వ తేదీ నుంచి జరగనున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పది, ఇంటర్ థియరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటచారి తెలిపారు. జిల్లా కేంద్రం కొత్తగూడెంలో బుధవారం ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణలో భాగంగా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ... ఓపెన్ స్కూల్ పరీక్షలు జిల్లాలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్తగూడెంలోని ప్రభుత్వ హైస్కూల్ (బాబుక్యాంప్), సెంట్‌మేరీ హైస్కూల్, సింగరేణి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు, ఇంటర్ విద్యార్థులకు జెడ్పీహెచ్‌ఎస్ ఆనందఖని, చుంచుపల్లి జీహెచ్‌ఎస్, పాతకొత్తగూడెంలోని జీహెచ్‌ఎస్, లిటిల్‌బర్డ్స్ స్కూల్‌లో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పుస్తకాల వితరణ

పాల్వంచ: కేటీపీఎస్ ఏడీఈ విద్యార్థులకు గణిత పుస్తకాలు అందించారు. బుధవారం పట్టణంలోని శ్రీనివాస కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడీఈ తోకల రామదాసు వంద మంది విద్యార్థులకు పుస్తకాలను అందించారు. మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో కనగాల అనంతరాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులతో జీఎం సమీక్ష

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని వివిధ విభాగాధిపతులతో ఏరియా జీఎం వీసం కృష్ణయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం ఇల్లెందులోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన సమీక్షలో కేఓసీ, జేకే–5 ఓసీ, జేకే ఓసీలోని వివిధ పనుల పురోగతిని సమీక్షించారు. కేఓసీ, జేకేలో ఉత్పత్తి, ఉత్పాదకాలను సకాలంలో పూర్తి చేయాలని, నూతన జేకేఓసీ నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్న పర్యావరణ పనులు సకాలంలో పూర్తి చేసి ఉత్పత్తి, ఉత్పాదక జరిగేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం రామస్వామి, ఏజీఎం ఐఈడీ గిరధర్‌రావు, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, కేఓసీ పీఓ గోవిందరావు, జేకేఓసీ పీఓ కృష్ణమోహన్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు పాల్గొన్నారు.

ఇసుక ఉచితంగా ఇవ్వండి



ధర్నా చేస్తున్న నాయకులు, లబ్ధిదారులు

ఇల్లెందురూరల్: ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వమే ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పూబెల్లి గ్రామంలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో శంకుస్థాపన శిలాఫలకం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, గిరిజన సంఘం నేత వజ్జ సురేష్ మాట్లాడుతూ.. పూబెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక అందుబాటులో లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. స్థానికంగా లభ్యమవుతున్న ఇసుకను ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి అక్రమంగా తరలిస్తున్నా అధికారులకు పట్టడం లేదని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని, స్థానికంగా లభించే ఇసుకపై స్థానిక గిరిజనులకే హక్కు కల్పించే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొడెం బోస్, మూతి వెంకటేశ్వర్లు, కల్తి రామకృష్ణ, కల్తి శంకరయ్య, సనప కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మదన్‌లాల్

జూలూరుపాడు: ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ మదన్‌లాల్ పిలుపునిచ్చారు. బుధవారం జూలూరుపాడు ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీఆర్‌ఎస్ మండల ముఖ్యకార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చరిత్రలో నిలిచిపోయేలా బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ ఉంటుందని, ఈ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, ప్రశాంత వాతావరణాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటున్నట్లు చెప్పారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందన్నారు. ఆచరణ సాధ్యంకాని హామీలతో కాంగ్రెస్ అభాసుపాలైందన్నారు. ఎదళ్లపల్లి వీరభద్రం, మూడ్ చిట్టిబాబు, దుద్దుకూరి నాగేశ్వరరావు, కట్రం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ చేయండి..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో జీఓ నంబర్ 76 ద్వారా ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి ఎన్నికల సమయంలో ఇంటి పట్టాలు ఇస్తానని నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీ ఏమైందని జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ కార్యదర్శి యర్రా కామేష్ ప్రశ్నించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం పట్టణంలో ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న వారికి యాజమాన్య హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం జీఓ76 ప్రవేశపెట్టగా సుమారు రెండువేల మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. దరఖాస్తుతో పాటు డబ్బులు కూడా కట్టారని, ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే పట్టాల పంపిణీ ప్రక్రియను నిలిపివేశారని, ఎన్నికలు జరిగి 16 నెలలు దాటినా నేటికీ పట్టాల పంపిణీ ప్రక్రియ ప్రారంభికపోవడంతో ఇల్లులు కొనుగోలు, అమ్మకాలు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

మౌలిక వసతులు కల్పించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఇల్లెందురూరల్: గ్రామాలలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని సుభాష్‌నగర్, సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ కార్యాలయాల ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ మాట్లాడుతూ.. గ్రామాలలో ప్రజలకు పంచాయతీల నుంచి సౌకర్యాలు సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరుకు నోచుకోవడం లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు జాబితాలో లేవన్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని పలుమార్లు ఉద్యమాలు చేసినా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, మాదారపు వెంకటేశ్వర్లు, వజ్జ సురేష్, దుర్గయ్య, సంతోష్, వెంకన్న, సుజాత పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించండి..

జూలూరుపాడు: ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డిలకు వేర్వేరుగా ఫీల్డ్ అసిస్టెంట్లు వినతిపత్రాలు అందజేశారు. ఐఎన్‌టీయూసీ ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ... మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎఫ్‌టీఈ, పే స్కేల్, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. మూడు రమేష్, డి.రవి, బి.భద్రం, జి.హరికిషన్, బి.బాల్యా, డి.నాగమణి, ఎ.లక్ష్మి, జి.నాగేష్, బి.జగదీష్, బి.నరేష్, ఎస్కే షరీఫ్ పాల్గొన్నారు.

దశాబ్దాలుగా నడక.. నరకం

- గుంతలు, కంకరపై ప్రయాణం
- ఆందోళన చెందుతున్న మూడు గ్రామాల ప్రజలు
- రోడ్డుపై నిరసన




రోడ్డును చూపుతున్న ప్రజలు



ప్రమాదకరంగా తావుర్యా తండా రోడ్డు

టేకులపల్లి: మండలంలోని తావుర్యా తండా నుంచి కోక్యా తండా మీదుగా తడికలపూడి వరకు దశాబ్దాలుగా పక్కా రోడ్డు లేక ఆదివాసీ, గిరిజనులు అవస్థలు పడుతున్నారు. తేలిన కంకర, అడుగడుగునా గుంతలతో రాకపోకలు ఇబ్బందిగా, ప్రమాదకరంగా ప్రయాణం కొనసాగిస్తున్నారు. సుమారు 20 సంవత్సరాల క్రితం రోడ్డు నిర్మాణం కోసం కంకర పోసి వదిలేశారు. ఆనాటి నుంచి నేటి వరకు పక్కా రోడ్డు లేకపోవడంతో ప్రజల కష్టాలు వర్ణనాతీతం. సుమారు ఆరు కిలోమీటర్లు ప్రతీరోజూ నడక యాతనే. ఈ మార్గంలో ప్రయాణం అంటే జనం భయపడుతున్నారు. ఇప్పటికే తేలిన కంకర, గుంతల వల్ల పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. గత ప్రభుత్వం హయాంలోనే ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు నుంచి కొత్తతండా(పి), తావుర్యా తండా, ఈర్యా తండా, కోక్యా తండాల మీదుగా తడికలపూడి వరకు బీటీ రోడ్డు మంజూరైనప్పటికీ కొంత మేరకు మాత్రమే బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మిగిలిన రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. ప్రభుత్వం మారిన తరువాత కూడా పనులు ప్రారంభం కాలేదు. ప్రజల అవస్థలు చూసి ఉన్నతాధికారులు స్పందించాలని, పక్కా రోడ్డు నిర్మాణానికి ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ చూపాలని మూడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


బీటీ రోడ్డు నిర్మించాలి..



తావుర్యా తండా నుంచి కోక్యా తండా మీదుగా తడికలపూడి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి. ఇరవై ఏళ్ల నుంచి పక్కా రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నాం. కంకర తేలి, రోడ్డుపై గుంతల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించాలి.

– గుగులోత్ సత్రు, కోక్యాతండా

పనులు జరుగుతున్నాయి..



ఇల్లెందు నియోజకవర్గంలోని ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య పని చేస్తున్నారు. టేకులపల్లి మండలంలో ఒక్కొక్కటిగా అభివృద్ధి పనులు చేస్తూ వస్తున్నారు. సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. తావుర్యా తండా – కోక్యా తండా రోడ్డు గురించి ఎమ్మెల్యేకి చెప్పి రోడ్డు నిర్మాణం చేసేలా నా వంతు కృషి చేస్తాను.

– కోరం సురేందర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవం



కొత్తగూడెంటౌన్: న్యూగొల్లగూడెంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న డీడబ్ల్యూఓ స్వర్ణలతా లెనీనా

కొత్తగూడెంటౌన్: పోషక విలువలు ఉన్న ఆహారమే తల్లీబిడ్డల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని జిల్లా సంక్షేమశాఖ అధికారిణి స్వర్ణలతా లెనీనా అన్నారు. బుధవారం కొత్తగూడెం న్యూగొల్లగూడెం సెక్టార్‌లో పోషణ్ పక్షోత్సవ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా సంక్షేమశాఖ (డీడబ్ల్యూఓ) అధికారి స్వర్ణలతా లెనినా హాజరయ్యారు. గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మాట్లాడుతూ.. ప్రతీ తల్లీబిడ్డలకు అంగన్‌వాడీల ద్వారా పోషకాహారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ పద్మశ్రీ, సూపర్‌వైజర్ సరోజిని, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇల్లెందు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 8 నుంచి 22 వరకు పోషణ పక్షోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయి. బుధవారం పట్టణంలోని పరదేశీ బస్తీ –16వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం, అన్నప్రాశన వేడుకలు నిర్వహించారు. సీడీపీఓ అరుణకుమారీ మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రోషిణీ, టీచర్లు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు పరిధి టేకులపల్లి, బోడు, బొమ్మనపల్లి, సులానగర్, గంగారం సెక్టార్లలో పోషణ్ పక్వాడా కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం బొమ్మనపల్లి సెక్టార్ బిల్లు తండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార హాజరై గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసాలు చేశారు. పోషకాహార లోపం వల్ల కలిగే నష్టాలను, గర్భిణులకు 1000 రోజుల ప్రణాళిక గురించి వివరించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించాలన్నారు. బాల్య వివాహాలను నివారించాలని కోరారు. సూపర్‌వైజర్ యశోదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సరోజ, రోజా, విజయ, విజయలక్ష్మి, పద్మ, రమణశ్రీ, పూర్ణ, అమ్మీ, సరోజ పాల్గొన్నారు.